# ములుగు జిల్లాలో భారీ వర్షం

- మంగపేట, గోవిందరావుపేటలో వడగండ్లు
- నర్సింహసాగర్, మల్లూరు శివార్లలో వెయ్యి ఎకరాల్లో వరి నేల పాలు
- కల్లాల్లో తడిసి ముద్దయిన మిర్చి
- పలు చోట్ల దెబ్బ తిన్న వరి, మామిడి
- గాలిదుమారంతో విద్యుత్ సరఫరాకు అంతరాయం


గోవిందరావుపేటలో పడిన వడగండ్లు


గోవిందరావుపేట : పస్రాలో భారీ గాలులతో లేచిపోయిన రేకులు

ఏటూరునాగారం/ వాజేడు/ వెంకటాపురం (నూగూరు)/ ములుగు రూరల్/ తాడ్వాయి/ గోవిందరావుపేట/ మంగపేట, ఏప్రిల్ 7 : ములుగు జిల్లాలో సోమవారం సాయంత్రం ఉరుములు మెరుపులతో కూడిన భారీ వర్షం పడింది. గాలి దుమారానికి మిరి నేల రాలగా, వరి పంట దెబ్బతిన్నది. పిడుగులు పడిన శబ్దాలు రావడంతో రైతులు తమ పంటల వద్దకు వెళ్లేందుకు భయ పడ్డారు. దీంతో ఆరబోసిన మిర్చిని కాపాడుకునేందుకు రైతులు పరదాలు కప్పగా, కొన్ని చోట్ల తడిసి పోయింది. మంగపేట మండలంలోని నర్సింహసాగర్, మల్లూరు గ్రామాల శివార్లలో కురిసిన వడగండ్ల వానకు సుమారు వెయ్యి ఎకరాలకు పైగా (ఆడ మగ) రకం వరి పంట నేల పాలైంది. విత్తన కంపెనీల నిబంధనల ప్రకారం సస్యరక్షణ చర్యలతో సాగు చేసిన మేల్‌ఫిమేల్ వరి పంట ప్రస్తుతం కోత దశలో ఉంది. ఈ క్రమంలో వడగండ్లు పడడంతో చేతికొచ్చిన వరి గింజలు నేల పాలయ్యాయి. పొట్ట దశలో ఉన్న వరి పొలాలు ఈదురు గాలలకు పడిపోయాయని మరికొంత మంది రైతులు చెప్తున్నారు. ఇక కల్లాలో ఆరబోసుకున్న మిర్చి కూడా తడిసి ముద్దయిందని, రంగు మారుతుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గోవిందరావుపేటలో వడగండ్లు పడ్డాయి. మామిడి తోటల్లో కాయలు రాలిపడడంతో రైతులు దిగాలు చెందుతున్నారు. అంతేకాకుండా భారీ స్థాయిలో పంట నష్టం వాటిల్లే పరిస్థితి నెలకొంది. విద్యుత్ తీగలపై చెట్లు పడిపోవడంతో సరఫరా నిలిచిపోయింది. గాలి బీభత్సానికి పస్రాలో ఇంటి రేకులు లేచి పోయాయి. తాడ్వాయి మండలం కాటాపురం, బీరెల్లి, నార్లాపురం తదితర గ్రామాల్లో రెండు గంటల పాటు వర్షం కురిసింది. ములుగు జిల్లా కేంద్రంలో సాయంత్రం 6:45కు మొదలైన గాలి దూమారం గంటన్నర వరకు కొనసాగింది. దీంతో వాహనదారులు తమ వాహనాలను రోడ్డు వెంట నిలుపుకున్నారు. జిల్లా కేంద్రంతో పాటు మండల వ్యాప్తంగా విద్యుత్ సరఫరా పూర్తిగా నిలిచిపోయింది. మల్లంపల్లి, మహ్మద్‌గౌస్‌పల్లి గ్రామాలతో పాటు మరి కొన్ని గ్రామాల్లో భారీ వర్షం కురిసింది. మిర్చి రైతులతో పాటు వరి, మక్కజొన్న రైతులు పంటలను కాపాడుకునేందుకు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. అకాల వర్షం కారణంగా కోతకు సిద్ధంగా ఉన్న వరిచేన్లు దెబ్బతినే అవకాశం ఉందని రైతులు ఆందోళన చెందుతున్నారు. వ్యవసాయ శాఖ ద్వారా నేల పాలైన తమ పంటలు పరిశీలించి ప్రభుత్వం ఆదుకోవాలని ఈసందర్భంగా బాధిత రైతులు విజ్ఞప్తి చేస్తున్నారు.


వాజేడు : వర్షంతో కమ్ముకున్న మబ్బులు


ఏటూరునాగారంలో కురుస్తున్న వర్షం

## సమస్యలను సత్వరమే పరిష్కరించాలి


వినతులను స్వీకరిస్తున్న కలెక్టర్ దివాకర

ములుగు రూరల్, ఏప్రిల్ 7: ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులను అధికారులు సత్వరమే పరిష్కరించాలని కలెక్టర్ టీఎస్ దివాకర అన్నారు. సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో 35 దరఖాస్తులు వచ్చినట్లు తెలిపారు. ఇందులో అత్యధికంగా 12 భూ సమస్యలు వచ్చాయన్నారు. గృహ నిర్మాణ శాఖకు 2, పింఛన్‌కు 3, ఉపాధి కల్పనకు 1, ఇతర శాఖలకు 17 దరఖాస్తులు అందాయని తెలిపారు. అధికారులు దరఖాస్తులపై నిర్లక్ష్యం చేయకుండా వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. అదనపు కలెక్టర్లు సీహెచ్ మహేందర్‌జీ, సంపత్‌రావు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## గిరిజన దర్బార్‌లో వినతులు


వినతులు సమర్పిస్తున్న గిరిజనులు

ఏటూరునాగారం, ఏప్రిల్ 7: ఐటీడీఏ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన గిరిజన దర్బార్‌లో ఏవో రాజ్‌కుమార్ వినతులు స్వీకరించారు. వాజేడు మండలం చెరుకూరు గ్రామానికి చెందిన యాలం పగిడయ్య గిరి వికాసం కింద బోరు మంజూరు చేయాలని వినతి పత్రం ఇచ్చారు. వెంకటాపురం మండలం రామచంద్రపురం గ్రామానికి చెందిన పీ రజిత మరో 42 మంది గ్రామస్తులు గ్రామ పంచాయతీకి మంజూరైన గిరిజన పరస్పర సహకార సంఘం ఇసుక రీచ్‌లను రద్దు చేయాలని విన్నవించారు. మహబూబాబాద్ జిల్లా గూడూరు మండలం కొల్లాపూర్, తీగలవేణి, అప్పలరాజు, గ్రామాల్లో పీఏజీవైఏ కింద చేసిన పనుల బిల్లులు చెల్లించాలని మాజీ సర్పంచ్‌లు కోరాతరు. దర్బార్‌లో మేనేజర్ శ్రీనివాస్, డీటీ అనీల్, వెంకన్న పాల్గొన్నారు.

## ప్రజావాణికి తొమ్మిది దరఖాస్తులు

కాటారం, ఏప్రిల్ 7 : తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో వివిధ సమస్యలపై తొమ్మిది వినతులు వచ్చినట్లు తహసీల్దార్ నాగరాజు తెలిపారు. రెవెన్యూ శాఖకు సంబంధించి రేషన్ కార్డుల సవరణ, చేర్పులపై 8 మంది దరఖాస్తు చేసుకోగా, మండలకేంద్రంలోని గారెపల్లి యాదవ కాలనీలో మిషన్ భగీరథ నీరు రావడం లేదని దరఖాస్తు ఇచ్చినట్లు తెలిపారు.

## దరఖాస్తులను మున్సిపల్ కార్యాలయంలో ఇవ్వాలి

కృష్ణకాలనీ, ఏప్రిల్ 7 : రాజీవ్ యువ వికాసం పథకానికి దరఖాస్తు చేసుకున్న వారు ఆన్‌లైన్ దరఖాస్తులను మున్సిపల్ కార్యాలయంలో అందజేయాలని కమిషనర్ బిర్రు శ్రీనివాస్ సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. దరఖాస్తు ఫారంతో పాటు రేషన్ కార్డు జిరాక్స్ లేదా ఇన్ కమ్ సర్టిఫికెట్, ఆధార్ కార్డు, కులం సర్టిఫికెట్, బ్యాంకు అకౌంట్, పాస్ ఫొటో జత చేసి రూమ్ నెంబర్-12లో ఇవ్వాలని సూచించారు.

## మాజీ ఎమ్మెల్యే గండ్రను కలిసిన తిరుపతి


తిరుపతిని సన్మానిస్తున్న మాజీ ఎమ్మెల్యే గండ్ర

చిట్యాల, ఏప్రిల్ 7 : కేటీఆర్ సేన మండలాధ్యక్షుడిగా ఇటీవల నియామకమైన మురహరి (ట్రిమ్స్) తిరుపతి మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డిని పరకాలలోని ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. తన నియామకానికి సహకరించినందుకు పుష్పగుచ్ఛం అందజేసి కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం తిరుపతిని గండ్ర శాలువాతో సన్మానించి, స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్ఎస్ గెలుపునకు పార్టీ కార్యకర్తలను సమన్వయం చేసుకుంటూ ముందుకు కొనసాగాలని ఆదేశించారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ కుంభం క్రాంతి కుమార్‌రెడ్డి, పార్టీ మండలఅధ్యక్షుడు అల్లం రవీందర్, కార్యనిర్వాహక అధ్యక్షుడు పిట్ట సురేశ్, ప్రధాన కార్యదర్శి ఏరుకొండ రాజేందర్, మండల యువజన అధ్యక్షుడు టౌటం నవీన్, సీనియర్ నాయకులు పాండ్రాల వీరస్వామి, పెరుమాండ్ల రవీందర్, దామెర రాజు, నైన్‌పాక గ్రామ యువజన అధ్యక్షుడు గుండు నగేశ్ పాల్గొన్నారు.

## ఆయిల్ పామ్ సాగుతో అధిక లాభాలు

కాటారం, ఏప్రిల్ 7 : ఆయిల్ పామ్ సాగుతో అధిక లాభాలు పొందవచ్చునని మండలంలోని శంకరాంపల్లికి చెందిన రైతు కస్తూరి మునిస్వామి అన్నారు. శంకరాంపల్లి శివారులోని తన రెండు ఎకరాల్లో నాలుగు సంవత్సరాల క్రితం ఆయిల్ పాం మొక్కలు నాటినట్లు చెప్పారు. పంట తొలిసారిగా కోతకు రావడంతో సోమవారం టన్నుకు రూ.21వేలు చెల్లించి సువెన్ ఆగ్రో ఇండస్ట్రీస్ మేనేజింగ్ డైరెక్టర్ గండ్ర గౌతమ్ రెడ్డి కొనుగోలు చేసినట్లు పేర్కొన్నారు. కూలీల ఖర్చు లేకుండా ఇతర పంటలకు ప్రత్యామ్నాయంగా ఆయిల్ పామ్ సాగు చేయడం లాభదాయకంగా ఉందని తెలిపారు. కార్యక్రమంలో సువెన్ ఆగ్రో ఇండస్ట్రీస్ విస్తరణ అధికారి కేతిరెడ్డి, రాజేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

WANTED

★ ప్రముఖ ఆయుర్వేద క్లినిక్‌లో రిసెప్షనిస్ట్ మరియు అసిస్టెంట్‌గా చేయుటకు డిగ్రీ పూర్తి చేసిన యువతి కావలెను. వెంటనే సంప్ర: సెల్: 8520902105.
NTW-000

PLOT FOR SALE



★వరంగల్ హైవే రఘునాథ్‌పల్లికి దగ్గరలో 2 లక్షలకే 121 Sq.yds. Plots అన్ని డెవలప్‌మెంట్స్‌తో కలవు. స్పాట్ రిజిస్ట్రేషన్. ఫోన్: 8523041059.
NT-329891

LOSS OF DOCUMENT

★I, BEERAM BHARGAVI aliyas KALYANI, W/o BEERAM VENKAT REDDY. H.No. 2-10-405, Road No. 3D, Teachers Colony Phase-II, Hanumakonda, TG. have lost my Original Link Doument No. 280/1995, Plot No. 23, Extent of 288.88 sq.yds. Situated at Bheemaram, Hasanparthy, Hanumakonda. While travelling from KUC to Bheemaram by Auto On 03-04-2025 if anybody found Please Call Me: 9950258493.
NTW-6581

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్
4 లైన్ల బ్లాక్ అండ్ వైట్ ప్రకటన కేవలం 200/- మాత్రమే
4 లైన్ల బ్లాక్ అండ్ వైట్ 4 ప్రకటనలకు కేవలం 600/- మాత్రమే
ప్రతి అదనపు లైన్‌కు 50/- మాత్రమే
ప్రకటనల విభాగం : 9182777552
HANAMKONDA 9182777563
WARANAGAL 9182777556
JAYASHANKAR BHUPALPALLY - 9182777135
MULUGU - 9182777135
MAHABUBABAD - 9182777557
JANGAON - 9182777565

## దహన సంస్కారాలకు సాయం

కృష్ణకాలనీ, ఏప్రిల్ 7 : భూపాలపల్లి మండలం గొల్లబుద్ధారం గ్రామానికి చెందిన నిరుపేద దళిత కుటుంబానికి చెందిన మెండె లచ్చయ్య సోమవారం మృతిచెందాడు. ఆయన అంత్యక్రియలు నిర్వహించేందుకు డబ్బులు లేకపోవడంతో గ్రామస్తులు ప్రొఫెసర్ జయశంకర్ ఫౌండేషన్‌కు వివరించారు. వెంటనే స్పందించిన చైర్మన్ అయిలి మారుతి ఫౌండేషన్ టీం సభ్యులతో కలిసి మృతుడి ఇంటికి వచ్చి సొంత ఖర్చులతో దహన సంస్కారాలు నిర్వహించారు. ఈ సందర్భంగా మారుతి మాట్లాడుతూ నిరుపేద దళిత కుటుంబానికి అండగా ఉంటామని, లచ్చయ్య కూతురు చదువుకు పూర్తి ఖర్చులు, భవిష్యత్తులో పెళ్లి విషయంలో అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. గ్రామ పెద్దలు మారుతిని అభినందించారు.


ఘటనా స్థలిని పరిశీలిస్తున్న విద్యుత్ అధికారులు

## స్తంభాన్ని ఢీకొట్టిన కారు

గోవిందరావుపేట, ఏప్రిల్ 7 : విద్యుత్ స్తంభాన్ని కారు ఢీకొట్టిన ఘటన పస్రాలోని గుండ్లవాగు సమీపంలో సోమవారం జరిగింది. వివరాలు ఇలా ఉన్నాయి.. ఛత్తీస్‌గఢ్ రాష్ట్రానికి చెందిన కారులో నలుగురు వ్యక్తులు అతి వేగంగా వస్తుండగా అదుపు తప్పి పల్టీ కొట్టింది. పక్కనే ఉన్న తాడ్వాయి ఫీడర్ 33కేవీ లైన్ విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టడంతో స్తంభం విరిగిపోయింది. కారులో ఉన్న వారికి గాయాలు కాగా ములుగు ప్రభుత్వ దవాఖానకు తరలించారు. కాగా, తాడ్వాయి మండలానికి విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు లైన్ ఇన్‌స్పెక్టర్ దండు రామచంద్రయ్య సిబ్బందితో వచ్చి పరిశీలించి మరమ్మతులు చేపట్టారు.


ఆర్థికసాయం అందజేస్తున్న వైద్య సిబ్బంది

## మృతురాలి కుటుంబానికి ఆర్థిక సాయం

తాడ్వాయి, ఏప్రిల్ 7 : స్థానిక పీహెచ్‌సీలో కాంట్రాక్ట్ బేసిక్‌లో పనిచేస్తున్న రేగ లక్ష్మి ఇటీవల మృతిచెందగా సోమవారం వైద్య సిబ్బంది ఆమె కుటుంబానికి ఆర్థిక సాయం అందించారు. వైద్య శాఖ రూ.43,700, జిల్లా వైద్యాధికారి గోపాల్‌రావు ఆదేశాల మేరకు మండలంలోని వైద్య సిబ్బంది రూ.28 వేలు వైద్యాధికారులు చిరంజీవి, రణధీర్ ఆధ్వర్యంలో సోమవారం లక్ష్మి కుమారుడు సతీశ్‌కు అందజేశారు. కార్యక్రమంలో ఐటీడీఏ డిప్యూటీ డీఎంహెచ్‌వో క్రాంతికుమార్, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ సంపత్‌రావు, సిబ్బంది సంజీవరావు, శకుంతల, వెంకట్‌రెడ్డి, సమ్మయ్య, స్వామి, హిమకిరణ్, ఉష, సరస్వతి, రజిత పాల్గొన్నారు.

## వేసవిలో గర్భిణులు జాగ్రత్తలు తీసుకోవాలి

వాజేడు, ఏప్రిల్ 7 : వేసవిలో వడదెబ్బ తగులకుండా గర్భిణులు జాగ్రత్తలు తీసుకోవాలని వైద్యాధికారి యోషిత సూచించారు. మండలంలోని పేరూరు పీహెచ్‌సీకి సోమవారం వైద్య పరీక్షల కోసం వచ్చిన వారిని పరీక్షించి మందులు అందజేశారు. వడదెబ్బ తగులకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సూచనలు చేశారు. కార్యక్రమంలో హెచ్ఈవో పాయం వేణుగోపాలకృష్ణ, పీహెచ్ఎస్ సంగీత, నర్సింగ్ ఆఫీసర్ రమ, ఏఎన్ఎంలు అనూష, సుమలత, శకుంతల, ఎల్‌టీ అశ్విన్, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

# సరస్వతీ పుష్కరాల పనులు పూర్తి చేయాలి

**భూపాలపల్లి కలెక్టర్ రాహుల్ శర్మ**


మహదేవపూర్ : సరస్వతీ పుష్కరాల నిర్మాణ పనులను పరిశీలిస్తున్న కలెక్టర్ రాహుల్ శర్మ

మహదేవపూర్ (కాళేశ్వరం), ఏప్రిల్ 7 : కాళేశ్వరంలో మే 15 నుంచి 26 వరకు నిర్వహించనున్న పుష్కరాల పనులు మే 4లోగా పూర్తి చేయాలని కలెక్టర్ రాహుల్‌శర్మ అధికారులను ఆదేశించారు. సోమవారం అదనపు కలెక్టర్ విజయలక్ష్మితో కలిసి ఆయన కాళేశ్వరంలో పర్యటించారు. భక్తుల సౌకర్యార్థం రూ.25కోట్లతో చేపడుతున్న పనులను క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. మొదట వీఐపీ ఘాట్ వద్ద జరుగుతున్న ర్యాంప్ నిర్మాణం, సరస్వతీదేవి విగ్రహ ఏర్పాటుకు జరుగుతున్న పనులు, శాశ్వత ప్రాతిపదికన నిర్మిస్తున్న మరుగుదొడ్ల పనులను పరిశీలించారు. అక్కడి నుంచి ప్రధాన ఘాట్ వద్ద జరుగుతున్న పనులను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. అనంతరం ఈవో కార్యాలయంలో అధికారులతో సమీక్ష నిర్వహించారు. సరస్వతీ పుష్కరాలకు పెద్ద ఎత్తున ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. కొన్ని చోట్ల శాశ్వత ప్రాతిపదికన నిర్మాణాలు చేపట్టామని, పనులు త్వరగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. డీపీవో నారాయణరావు, పీఆర్ డీఈ సాయిలు, ఎంపీడీవో వెంకటేశ్వర్లు, డీటీ కృష్ణ, ఆర్ డబ్ల్యూఎస్ డీఈ రమేశ్, ఈవో మహేశ్ పాల్గొన్నారు.

**ఇండ్ల దరఖాస్తుల పరిశీలన వేగవంతం చేయాలి**

భూపాలపల్లి రూరల్ : ఇందిరమ్మ ఇండ్ల దరఖాస్తుల పరిశీలన ప్రక్రియను వేగవంతం చేసి త్వరగా గ్రౌండింగ్ పనులు చేపట్టాలని కలెక్టర్ రాహుల్‌శర్మ అన్నారు. ఐడీవోసీలోని మొదటి అంతస్తులో గృహ నిర్మాణ శాఖ ప్రాజెక్ట్ డైరెక్టర్ కార్యాలయాన్ని కలెక్టర్ ప్రారంభించి, ఆ శాఖ అధికారులకు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం మాట్లాడుతూ లబ్ధిదారులకు ఇళ్ల నిర్మాణం గడువు లోపు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.

**ప్రజావాణి సమస్యలు పరిష్కరించాలి**

ఐడీవోసీ కార్యాలయంలో వివిధ శాఖల అధికారులతో కలిసి ప్రజావాణిలో ప్రజల నుంచి వివిధ సమస్యలపై కలెక్టర్ దరఖాస్తులు స్వీకరించారు. ప్రతి దరఖాస్తును సమగ్రంగా పరిశీలించి, పరిష్కారానికి సత్వర చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమాల్లో అదనపు కలెక్టర్లు విజయలక్ష్మి, అశోక్‌కుమార్, హౌసింగ్ శాఖ ప్రాజెక్ట్ డైరెక్టర్ లోకిలాల్, ఆర్డీవో రవి, డీఈ శ్రీకాంత్, ఏఈ రాజలింగం పాల్గొన్నారు.


కంటి పరీక్షలను పరిశీలిస్తున్న డీఎంహెచ్‌వో మధుసూదన్

## అంగన్‌వాడీల్లో కంటి, మానసిక పరీక్షలు

కాటారం/మహదేవపూర్, ఏప్రిల్ 7 : జాతీయ ఆరోగ్య మిషన్ ఆధ్వర్యంలో ఆరేళ్ల లోపు అంగన్‌వాడీ చిన్నారుల్లో కంటి, మానసిక సమస్యలు గుర్తించే కార్యక్రమం సోమవారం ప్రారంభమైంది. కాటారంలోని పలు అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులకు చేపడుతున్న పరీక్షలను డీఎంహెచ్‌వో మధుసూదన్ పరిశీలించారు. సమస్య ఉన్నట్లు గుర్తించిన వారికి అవసరమైన వైద్యం అందేలా చర్యలు తీసుకోనున్నట్లు తెలిపారు. వైద్యులు ప్రమోద్, శ్రీనివాస్, సుజాత, లింగమూర్తి, పాల్గొన్నారు. అలాగే, మహదేవపూర్ మండలం అన్నారం అంగన్‌వాడీ కేంద్రంలో నేషనల్ హెల్త్ మిషన్ వైద్య బృందం సుమారు 86 మంది చిన్నారులకు ఉచిత కంటి పరీక్షలు చేసి, ఉచితంగా మందులు పంపిణీ చేసింది. డాక్టర్లు రవి, దీప్తి, రామ్మూర్తి, ఫార్మాసిస్ట్ సుమన్, ఏఎన్ఎం సునీత పాల్గొన్నారు.

## డిస్ట్రిబ్యూటరీ కెనాల్‌పై గ్రామ సభ

మహదేవపూర్, ఏప్రిల్ 7 : మండలంలోని ఎడపల్లిలో చిన్న కాళేశ్వరం ప్రాజెక్ట్ డిస్ట్రిబ్యూటరీ కెనాల్ తవ్వకాల భూసేకరణపై సోమవారం అధికారులు రైతులతో కలిసి ప్రత్యేక గ్రామ సభ నిర్వహించారు. గ్రామ శివారులో చేపట్టనున్న కాల్వల గురించి క్షుణ్ణంగా వివరించారు. ప్రజల అభిప్రాయాలు, అభ్యంతరాలను స్వీకరించారు. డిప్యూటీ తహసీల్దార్ కృష్ణ, ఏఈఈ భరత్ ఆనంద్, సర్వేయర్ రాజా రమేశ్, పంచాయతీ కార్యదర్శి మహేశ్, గ్రామస్తులు పాల్గొన్నారు.

## ఎస్టీ వర్గీకరణకు కమిషన్ నియమించాలి

ఏటూరునాగారం, ఏప్రిల్ 7 : ఎస్టీ వర్గీకరణ కోసం కమిషన్ నియమించాలని ఈ నెల 17న ఇల్లందులో నిర్వహించే తుడుందెబ్బ బహిరంగ సభను విజయవంతం చేయాలని సంఘం రాష్ట్ర కార్యదర్శి చింత కృష్ణ, ఎమ్మార్పీఎస్ జాతీయ నాయకుడు నెమలి నర్సయ్య కోరారు. ఐటీడీఏ కార్యాలయం వద్ద సోమవారం కరపత్రం ఆవిష్కరించి వారు మాట్లాడారు. సుప్రీం తీర్పును అనుసరించి ఎస్టీలను ఏబీసీలుగా వర్గీకరించి జనాభా నిష్పత్తి ప్రకారం ఆదివాసీలకు న్యాయం చేయాలని కోరారు. సమావేశంలో వట్టం జనార్దన్, బొల్లెం సారయ్య, ఎంఎస్‌పీ నాయకుడు వావిలాల స్వామి, పోశెట్టి అనసూర్య, పూనెం నాగేశ్వర్‌రావు, నక్క బుచ్చన్న, జాషువా, చర్ప లలిత, సోలం లక్ష్మీనర్సయ్య, కోరం శశికుమార్ పాల్గొన్నారు.


కరపత్రాలను ఆవిష్కరిస్తున్న నాయకులు

## ఆరోగ్యంగా జీవించడం మానవుని హక్కు

కృష్ణకాలనీ, ఏప్రిల్ 7: ఆరోగ్యంగా జీవించడం మానవుని హక్కు అని సీనియర్ సివిల్ జడ్జి, న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి కే జయరాంరెడ్డి అన్నారు. ప్రపంచ ఆరోగ్య దినోత్సవాన్ని పురస్కరించుకొని జిల్లా న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో మున్సిపల్ కౌన్సిల్ హాల్‌లో సోమవారం సమావేశం ఏర్పాటు చేయగా ఆయన హాజరై మాట్లాడారు. కనిపించే ఆశాజ్యోతులే ఆశ వర్కర్లు అన్నారు. ఉపాధి కూలీలకు ఓఆర్ఎస్ ప్యాకెట్లు విరివిగా అందించాలని సూచించారు. కార్యక్రమంలో ఆరోగ్య శాఖ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ ఉమాదేవి, హెల్త్ అసిస్టెంట్లు, ఏఎన్ఎంలు పాల్గొన్నారు.

**వెంకటాపూర్‌లో..**

వెంకటాపూర్ : ములుగు జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ ఆధ్వర్యంలో వరల్డ్ హెల్త్ డే సందర్భంగా మండల కేంద్రంలోని పీహెచ్‌సీలో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ముఖ్యఅతిథిగా చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ మేకల మహేందర్ పాల్గొని మాట్లాడారు. పొగాకు, గుట్కాలు, సిగరెట్లు తీసుకోవడం వల్ల అనారోగ్యం పాలవుతారన్నారు. చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని సూచించారు. డిప్యూటీ చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ బానోత్ స్వామిదాస్, అసిస్టెంట్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ రాచర్ల రాజ్‌కుమార్, ఫార్మాసిస్ట్ టీ రాజమణి, ఏ మునెమ్మ పాల్గొన్నారు.

## కాంగ్రెస్ నేతలు మోకాళ్ల యాత్ర చేసినా ప్రజలు నమ్మరు

గణపురం, ఏప్రిల్ 7 : కాంగ్రెస్ నాయకులు మోకాళ్లపై యాత్ర చేసినా ప్రజలు నమ్మరని డీఎస్‌పీ జిల్లా ప్రధాన కార్యదర్శి కండె రవి అన్నా రు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ రాజ్యాంగ పరిరక్షణ పేరుతో కాంగ్రెస్ చేస్తున్న పాదయాత్ర పెద్ద మోసమన్నారు. బీజేపీ, కాంగ్రెస్‌లోని అగ్రకుల నాయకులు ఓట్ల కోసం డైవర్షన్ పాలిటిక్స్ చేస్తున్నారని ఆరోపించారు. రాహుల్ గాంధీ రాజ్యాంగాన్ని పట్టుకొని తిరిగితే ఆయనకు ప్రజలపై ప్రేమ ఉన్నట్లు కాదన్నారు. పాదయాత్రను ప్రజలు నమ్మి మోసపోవద్దని సూచించారు.

## ఆశ కార్యకర్త మృతికి సంతాపం

వాజేడు, ఏప్రిల్ 7 : మండలంలోని పెనుగోలు గ్రామానికి చెందిన ఆశ కార్యకర్త ఉయిక సమ్మక్క ఆదివారం సాయంత్రం గుండెపోటుతో మృతిచెందింది. విషయం తెలుసుకున్న హెల్త్ సూపర్‌వైజర్ కోటిరెడ్డితోపాటు వైద్య సిబ్బంది, ఆశ కార్యకర్తలు సోమవారం పెనుగోలు కాలనీ గ్రామానికి వెళ్లారు. మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించి సంతాపం వ్యక్తం చేశారు.

## సింగరేణి పాఠశాలలో ఉచిత పాలిటెక్నిక్ కోచింగ్ సెంటర్

కృష్ణకాలనీ, ఏప్రిల్ 7 : సింగరేణి పాఠశాలలో ఈ - పాలీసెట్ తరగతులు ఈనెల 10 నుంచి మే 10 వరకు వరకు ఉచిత బోధన తరగతులు నిర్వహించనున్నట్లు భూపాలపల్లి ఏరియా అధికార ప్రతినిధి, పాఠశాల కరస్పాండెంట్ కే మారుతి, హెచ్ఎం కే ఝాన్సీరాణి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతి రోజూ ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులతో బోధన తరగతులు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. విద్యార్థులతో పాటు సింగరేణి కార్మికుల పిల్లలు, ఏరియాలోని చుట్టుపక్కల ప్రాంతాల విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

## ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభం

మంగపేట/ ఏటూరునాగారం/ వెంకటాపూర్, ఏప్రిల్ 7 : యాసంగి ధాన్యం కొనుగోలు కేంద్రాలు సోమవారం పలు మండలాల్లో పీఏసీఎస్‌ల ఆధ్వర్యంలో ప్రారంభమయ్యాయి. మంగపేట మండలం తిమ్మంపేట, బోరునర్సాపురం, బుచ్చంపేట, బాలన్నగూడెం, వాగొడ్డుగూడెం, చెరుపల్లి, వాడగూడెం గ్రామాల్లో పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కేంద్రాలను తహసీల్దార్ రవీందర్‌తో కలిసి పీఏసీఎస్ చైర్మన్ తోట రమేశ్, ఏటూరునాగారం మండలం గోగుపల్లిలో పీఏసీఎస్ ఆధ్వర్యంలో చైర్మన్ కూనూరు అశోక్, వెంకటాపూర్ మండలం నల్లగుంటలో పీఏసీఎస్ ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఏవో శైలజ ప్రారంభించారు. కొనుగోళ్లపై తగు సలహాలు, సూచనలు చేశారు. కార్యక్రమాల్లో మంగపేట సీఈవో జగన్నాధరావు, పీఏసీఎస్ వైస్ చైర్మన్ కాడబోయిన నరేందర్, డైరెక్టర్లు నర్రా శ్రీధర్, దేగల ఆదినారాయణ, అచ్చ సత్యనారాయణ, ఏటూరునాగారం సంఘం డైరెక్టర్ వంగపండ్ల రవి, సీఈవో గౌరమ్మ, సిబ్బంది అహ్మద్ పాషా, వెంకటాపూర్ ఏఈవోలు, రైతులు పాల్గొన్నారు.


బాధితులను పరామర్శిస్తున్న ఎమ్మెల్సీ మధుసూదనాచారి

## బాధితులకు ఎమ్మెల్సీ సిరికొండ పరామర్శ

టేకుమట్ల, ఏప్రిల్ 7 : మండలకేంద్రానికి చెందిన బెజ్జంకి రామయ్య మృతి చెందగా ఆయన కుటుంబాన్ని శాసనమండలి ప్రతిపక్ష నేత, ఎమ్మెల్సీ సిరికొండ మధుసూదనాచారి సోమవారం పరామర్శించారు. అనంతరం వెల్లంపల్లి గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్, బీఆర్ఎస్ నాయకుడు ఓరంగంటి సధాకర్ తల్లి భూలోకమ్మ ఇటీవల మృతి చెందగా దశదినకర్మకు హాజరయ్యారు. ఆయన వెంట బీఆర్ఎస్ కార్మిక శాఖ మండల అధ్యక్షుడు నేరెళ్ల రామకృష్ణగౌడ్, కొలిపాక రాజయ్య, ఆకోజ్ వరదాచారి, దొడ్డ కోటి, తోట సాగర్, లింగంపల్లి ప్రభాకర్‌రావు, పాలశంకర్, వాసాల రవి, కట్ల శీను, శ్రావణ్ ఉన్నారు.


మృతుడి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న పుట్ట మధు

## మృతుల కుటుంబాలకు పుట్ట పరామర్శ

మల్హర్, ఏప్రిల్ 7 : మండలంలోని పలు గ్రామాల్లో ఇటీవల మృతి చెందిన వారి కుటుంబాలను మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధు సోమవారం పరామర్శించారు. ఎడ్లపల్లి గ్రామంలో విజ్జగిరి లింగమ్మ, చిన్నతూండ్లలో కోట ఎర్ర సమ్మయ్య చిత్రపటాలకు పూలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడిన అక్కినవేని మాంతయ్య ను పరామర్శించి రోడ్డు ప్రమాదనికి గల కారణాలు అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు రాఘవరెడ్డి, సింగిల్ విండో మాజీ చైర్మన్ రామారావు, నాయకులు జాగిరి హరీశ్‌సుమన్, రాజేశ్వర్‌రావు, సురేశ్, పురుషోత్తంరావు, రాములు, నర్సయ్య, నారాయణరావు, మొగిలి ఉన్నారు.



భోజనాన్ని పరిశీలిస్తున్న డీసీడీవో రమాదేవి

## పాఠశాలలను సందర్శించిన డీసీడీవో

ములుగురూరల్, ఏప్రిల్ 7 : జిల్లాకేంద్రం పరిధిలోని కేజీబీవీ పాఠశాలతో పాటు, బండారుపల్లి మోడల్ పాఠశాలను సోమవారం డీసీడీవో రమాదేవి సందర్శించారు. రికార్డులను తనిఖీ చేయడంతో పాటు, పరిసరాలు, స్టాక్ రూమ్స్, టాయిలెట్లను పరిశీలించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం అందించాలన్నారు. చదువులో వెనుకబడుతున్న విద్యార్థులను గుర్తించి వారిని మెరుగుపర్చాలని సూచించారు. ఏ సమస్య తలెత్తినా తన దృష్టికి తీసుకురావాలని సూచించారు. భోదన సిబ్బంది సైతం సమయపాలన పాటించాలని, విద్యార్థులను సొంత పిల్లల్లా చూసుకోవాలన్నారు. ఆమె వెంట స్పెషల్ ఆఫీసర్ జీవనప్రియ, సిబ్బంది ఉన్నారు.

## ఆహార భద్రత కల్పించడమే లక్ష్యం

కృష్ణకాలనీ, ఏప్రిల్ 7 : పేదలందరికీ ఆహార భద్రత కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు అన్నారు. సోమవారం భూపాలపల్లి మండలం ఆజంనగర్ గ్రామంలో లబ్ధిదారులకు సన్న బియ్యం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామంలో మొదటిసారి స్వయంగా సన్న బియ్యం లబ్ధిదారుడి ఇంట్లో వారి కుటుంబ సభ్యులతో కలిసి భోజనం చేయడం సంతోషంగా ఉందన్నారు. అనంతరం ఇదే గ్రామానికి చెందిన తోట చంద్రమౌళి - సరిత కుటుంబ సభ్యులతో సహపంక్తి భోజనం చేశారు. వారికి కుటుంబ సభ్యులకు నూతన వస్త్రాలను అందజేశారు. కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ అశోక్ పాల్గొన్నారు.


క్రీడాకారులకు దుస్తులను అందజేస్తున్న సుమన్‌రావు

## క్రీడాకారులకు ఏకరూప దుస్తుల పంపిణీ

చిట్యాల, ఏప్రిల్ 7 : మండలకేంద్రంలోని పీఏసీఎస్ మైదానంలో నిర్వహిస్తున్న జిల్లాస్థాయి క్రికెట్ టోర్నమెంట్ సీసీపీఎల్ సీజన్ -3లో ఎస్ఎంహెచ్- బ్లాస్టర్స్ టీంకు అపోలో రీచ్ హాస్పిటల్ జీఎం నాయినేని సుమన్‌రావు ఏకరూప దుస్తులు, క్రీడా సామగ్రి అందజేశారు. మండలకేంద్రంలో నిర్వహిస్తున్న జిల్లా స్థాయి క్రికెట్ టోర్నమెంట్‌ను సోమవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ క్రీడాకారులు క్రీడల్లో ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో సీసీపీఎల్ నిర్వాహక అధ్యక్షుడు వినయ్‌కుమార్, ప్రధాన కార్యదర్శి మాటూర్ లవన్‌బాబు, సభ్యులు సాయి నితిన్, రాజ్‌కుమార్, గడ్డం శివ, ఆకుల హరీశ్, చింతకింది శ్రీనివాస్, కంచు శ్రీనివాస్, చింతల మహేందర్, శరత్ పాల్గొన్నారు.